
# గొడ్లు



"నీ దుడ్లు నీ కిచ్చేస్తా!... నా గొడ్లు నాకిచ్చేయ్!... ఊఁ ! చెప్పు. నీ దుడ్లు నీ మొకాన కొడ్తా!.... నా గొడ్లను నాకు తోలేయ్!"

రెండు భుజాల్ని ఒడిసి రెండుచేతులతో పట్టుకొన్నాడు. మాట రెట్టిస్తూ, మనిషిని అమాంతంగా కుదిపేస్తూ అడుగుతున్నాడు. అతని పిడికిళ్ళలో ఇరుక్కొన్న భుజాలు నలిగి పిండైపోతాయేమో? అనుకోకుండా ఎదురైన సంఘటన. తట్టుకొని నిలబడలేక తనకలాడుతూ తేల కండ్లు పడుతుంటే తెప్పరిల్లి ప్రయత్నపూర్వకంగా చూపును వాడిపై నిలిపాను.

కట్టిన గుడ్డ మాసింది. మాసిన గుడ్డ చీలికలు పేలికలుగా చినిగింది. జుట్టు రేగింది. కండ్లల్లో కసి ఉంది. ఒళ్ళు మసిబారినట్లు దుమ్మునిండింది. మాటల్లో కరకుతన ముంది. చేతుల్లో బలముంది. చూపుల్లో అగ్గి కురుస్తూ ఉంది.

అతడెవరో నాకు తెలియదు. నేనెవరో అతనికి తెలియదు. అయినా, మిడిసి పడుతున్న ఎండలో నాగతి పిల్లినోటికి చిక్కిన ఎలుకగతే అయింది.

"ఊఁ! చెప్పు. నీదుడ్లు నీ మొకాన కొడ్తా!.... నా గొడ్లను నాకు తోలేయ్!"

బదులు చెప్పలేని నిస్సహాయ స్థితి!

ఉన్నట్లుండి అతడు నా భుజాల్ని వదిలిపెట్టాడు. 'బ్రతుకు జీవుడా!' అనుకొన్నాను. కాని, అంతలోనే మేక మెడకింది చన్నుల్లాంటి నా చొక్కా కాలర్లని రెండు చేతులతో పట్టుకొన్నాడు. ఆ కాలర్లని వడేసి నాగొంతుకు బిగిస్తూ!...

'ఉఁ! ఇస్తావా, లేదా చెప్పు.

నీ దుడ్లు నీ కిసిరి పారేస్తా! నాగొడ్లను నాకు తోలేయ్!'

ఉరిమురిమి చూస్తూ, పండ్లు పటపటకొరుకుతూ కాలర్లని నా మెడకు బిగిస్తున్నాడు.

ఆ రోజు వాడి చేతిలో నా చావు మూడిందని నిర్ణయించుకొన్నాను.

'నాకేమీ తెలియదు. నన్నొదిలిపెట్టు' అని అడుక్కోవడానికి కూడా నోరుపెగల్లేదు. అవకాశం అసలే లేదు.

పొద్దు నడిమిట్టన ఉంది. ఎండ చంద్రనిప్పులు చెరుగుతూ ఉంది. ప్రక్కన్నే స్వర్ణముఖి. నీళ్ళను మింగి ఇసుకను నెమరేస్తున్నది. తారురోడ్డు నుండి మట్టిబాటకు మట్టిబాటనుండి కాలిబాటకు బస్సు మీద ఆ తరువాత కాలిబాట నుండి ఏటికి కాలి నడక మీద అంచెలంచెలుగా సాగింది నా నడక. అయితే ఆ ఏరుదాటేసరికి దేవుళ్ళే దిగివచ్చినంత పని అయింది.

ఆ ఏట్లో!... అబ్బబ్బ! ఎర్రని ఎండ. ఎండలో మిలమిలా మెరుస్తూ ఏటి ఇసుక. ఆ ఇసుకలో నడక. గుదికాళ్ళకు, చెప్పులకు మధ్య పడిన ఇసుకరేణువులు కొన్ని పై కెగిరి నాకు అభిషేకం చేస్తుంటే– కొన్ని వేమన్న గారి పద్యాన్ని మతికి తెస్తున్నాయి. ఆ పోరు పడలేక రెండు కాళ్ళల్లో చెప్పులు ఒక్క చేతికి తీసుకుంటే పైనా కిందా కాలిపోతూ ఉంది. ఏటి మీది వడగాడ్పులు గూబల్ని అదరగొడుతున్నాయి. కాళ్ళు ఇసుకలో కూరుకు పోతున్నాయి. ఏటిలోనే ప్రాణం ఎగిరిపోతుందనిపిస్తున్నది. ఎలాగో ఆ ఏరు దాటితే పెనంలో నుండి అగ్గిలో పడ్డట్టుగా వీడి చేతుల్లో పడ్డాను. బతికినంత బతుకు బతికి కడకు దిక్కులేని చావు చావాల్సి వచ్చిందే? అని గుండె కుములుతూ ఉంది. పోనీ– గజేంద్రుడిలా మొరపెట్టుకొన్నా దేవుళ్ళు దిగివచ్చే కాలమా? కాదే!

ఊరుకాని ఊర్లో దిక్కూ దరీ లేనిచోట నేనొక పసల పోలిగాణ్ణి!

నా దీనావస్థ అర్థమైనట్లుగా ఉన్నట్లుండి వాడు నా చొక్కా కాలర్లని వదిలిపెట్టాడు.

'గండం తప్పింది' అని అనుకొంటూ ఉంటే వాడునిలువునా కూలబడి నా రెండు కాళ్ళను పొదివి పట్టుకొన్నాడు.

'మా యబ్బతోడు. నీ దుడ్లు నీకు పువుల్లో పెట్టిచ్చేస్తా! నా గొడ్లను నాకు తోలేయ్. నీకు పున్నెం ఉంటింది.'

ఏడుపుతో కలిసి మాటలు. మాటలతో కలిసి ఏడుపు. గుండెల్ని చీల్చుకొని వస్తున్నాయి. ఆకు అల్లాడని ఆ ప్రశాంత వాతావరణంలో వాడి ఏడుపుతో గుండెలవిసి పోతున్నాయి.

ఆ అవస్థలోనుండి ఆశ్చర్యంలోపడి ఆశ్చర్యంలో నుండి తేరుకొనే సరికి వాడు ఎగిరిపడి పైకిలేచాడు. నా మొగంలో మొగం పెట్టి 'నిన్ను నమిలేస్తా!' అన్నంత తీక్షణంగా ఒక్కచూపు చూశాడు. ఆ చూపు వెన్నెముకలో ప్రశ్నగా బుసకొట్టింది. ఎంతసేపు? ఒక వక్క కొరికినంతసేపు. ఆ తరువాత అమాయకంగా నన్ను చూస్తూ విరగబడి నవ్వుతున్నాడు.

'వాడెవడో యదవ నా కొడుకు!– నా గొడ్లను తోలకపోతే నిన్నడిగితే పాపం! నువ్వేం జేస్తావ్? నే నొక పిచ్చినా కొడికిని' అని అంటూ జుట్టుపీక్కున్నాడు. తల తల కొట్టుకున్నాడు. అంతే! ఎలా వచ్చాడో అలానే దూసుకుపోతున్నాడు వడిశెల రాయిలాగా!

కయ్యా కంపా లెక్కపెట్టకుండా కాలికొద్దీ పరుగెత్తు తున్న వాడిని చూస్తూ నిలబడ్డాను.

'అయ్యోపాపం! ఎవడో వాడు– వాడి గొడ్లను ఎవడు తోలుకొనిపోయాడో? ఏమో?' అన్న సందేహం నిట్టూర్పుగా మారితే–

ఆ చెట్టుక్రింద నిలబడి ఆలోచిస్తున్నాను. వాడిమీద సానుభూతి కంటే నా మీద నాకే ఏవగింపు కలుగుతూ ఉంది. లేకుంటే దోవన పోతున్న జగడం ఇంటిదాకా అన్నట్లు నా కెందుకీ గొడవలన్నీ!.....

ఆ రోజు ఉదయం... నిద్ర లేస్తూనే ఒక దినపత్రిక చేతికి తీసుకొన్నాను. చేతికి వచ్చీ రాకమునుపే మొట్టమొదటి పేజీలో పతాక శీర్షికలో కంటపడింది– 'రాయలసీమలో కరవు రక్కసి కరాళనృత్యం' అని.

ఆ మాట మనసులో మెదిలేసరికి పత్రిక చదవడానికి బుద్ధిపుట్టలేదు. సీమలో తిష్ఠవేసిన కరువు రక్కసి నిర్దాక్షిణ్యంగా నా గుండెని పట్టి పిండుతున్నట్లనిపించింది. పత్రిక మడిచి పక్కన పెట్టాను. ఆలోచనలకు పగ్గాలు విడిచిపెట్టాను.

అప్పుడు నాకు గోచీ పెట్టుకునే వయస్సు. ఆ వయస్సులో రాయలసీమలో కరువు వచ్చింది. ఆ నాటి పరిస్థితి నా లేత గుండె మీద పదిలంగా పచ్చపొడిచింది. ప్రయత్నించి తుడిచినా పోయేది కాదది. అందుకే ఇంకా నాకు కండ్లకు కట్టినట్లు కన్పిస్తూ ఉంది. వరుసగా నాలుగైదేండ్లు వర్షాలు పడలేదు. చెరువులు నోళ్ళు ఆరవేశాయి. బావులు అడుగంటాయి. ఈ బావులమీద చెరువులమీదనే కదా రాయలసీమ సేద్యం ఆధారపడింది. ఏ తొలికోడి కూసే వేళకాడనో మోటగట్టి నోరులేని గొడ్లను ఆ బారిలో వెనక్కు ముందుకు లాగుతూ పాతాళ గంగను బానకు బాన పైకితెస్తే– నోటికి చేతికి అందడం అంతంత మాత్రం. ఇక వానలే లేకపోతే నీళ్ళెక్కడి నుండి రావాలి? కబిలెక్కడ కట్టాలి? సేద్యం ఎలా కొనసాగాలి? పంట లెలా పండాలి?

'ఆకలో రామచంద్రా!' అని అల్లాడిపోయారు జనం. ముంతడు గంజికోసరం గంజి కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. 'ఆకలి' అంటే అంత పెట్టడమే కానీ, చేయిచాచి ఎరుగని రైతుబిడ్డలు

గంజి కేంద్రాల వద్ద పడిగాపులతో అభిమానాన్ని చంపుకోలేక అడవుల మీద పడ్డారు. దేవదారు ఆకు తెచ్చుకున్నారు. ఆ ఆకు ఉడకబెట్టి తిన్నారు. వెదురు బియ్యం వండుక తిన్నారు. కలబంద గడ్డలతో కడుపులు నింపుకొన్నారు. కొన్ని ఊళ్ళకు ఊళ్ళే వలసపోయాయి. పుట్టి పెరిగిన ఊరిని నడయాడిన మట్టిని వదలలేని వాళ్ళు మాత్రం ఈలకరచి నిలబడ్డారు. చచ్చినంతమంది చావగా తప్పించుకొన్నవాళ్ళు ఆయుస్సు గట్టిదనుకొన్నారు.

రాయ లేలిన ఈ సీమలో వీధుల్లో రత్నాల్ని రాసులుపోసి అమ్మిన సీమలో సంకటి సలిబిండికి నోచుకోని ఈ సీమవాసులు నేడు గత వైభవాల నీడల్లో మేడలు కట్టుకొంటున్నారు. ఆ మేడల్లో నిగిడి నీలిగి చస్తున్నారు. పుట్టిన తరువాత ఎప్పుడో ఒకప్పుడు చావడం ఖాయమని కామందులు మందుమైకంలో వేదాంతాలు వల్లిస్తున్నారు.

ఆలోచిస్తూ మేడమెట్లు దిగుతున్నాను.

"వంకాయలు..... బెండకాయలు.... టొమాటాలు.... కూరలు.... ఆకు కూరలు."

నవనవ లాడుతున్న కాయకూరల్ని... ఆకు కూరల్ని... నాలుగు చక్రాల బండిపై కుప్పలు కుప్పలుగా రాశిపోసి... బండిని వీధి ప్రక్కగా నిలబెట్టి పక్కన నిలబడి– కూరగాయల పేర్లను పేరుపేరునా వొత్తొత్తి పలుకుతూ సరకు నాణ్యాన్ని మాటల్లో చిలుకుతూ కూరగాయ లమ్ముతున్నాడు ఒక వ్యక్తి.

మేడమెట్లు దిగుతూ అటువైపు చూశాను.

ఆ బండిమీద కూరగాయల్ని ఏరుకుంటున్న జవరాండ్ర చేతి వేళ్ళ కంటే అందంగా ఉన్నాయి బెండకాయలు. వాళ్ళ ఎదమీద వంపుల్ని ఎత్తి చూపుతున్నట్లున్నాయి నవనవ లాడుతున్న వంకాయలు. ఉదయకాంతిలో ఉలిక్కి పడుతున్న బుగ్గలతో పోటీపడుతున్నాయి టొమాటాలు. చెదిరిన ముంగురులకు సాదృశ్యంగా ఉన్నాయి ఆకుకూరలు!

ఆ దృశ్యం చూపులకు గాలం వేస్తే రెప్పార్చకుండా చూస్తున్నాను.

కరవు రక్కసి కరాళనృత్యం నన్ను వెక్కిరించింది.

ఇంటి ముందర నవ నవ లాడుతూ కూరగాయలు. ఇంటిలో కొళాయి తిప్పితే ఎగజిమ్ముతున్న నీళ్ళు. ఇంటి నుండి అడుగు బయటపెడితే ఆడుగుకొక్క బారు. బారులో బీరు. బీరు కాకుంటే హోటల్లో మోరు. సినిమా హాళ్ళ దగ్గర టిక్కెట్ల కొరకై పోరు. క్లబ్బుల్లో నగ్ననృత్యాల జోరు... ఏది ఆగింది? ఎప్పుడు ఆగింది?... ఈ కరువు కోసరమని!

చేతిలో డబ్బుంటే కొండ మీది కోతి దిగి రమ్మంటే వచ్చే రోజులివి!

పట్టణాల్లో ఏదోవిధంగా పొద్దు గూట్లో పడేసరికి చేతిలో డబ్బు పడుతుంది. బతుకు ఏదోవిధంగా కొనసాగిపోతూ ఉంటుంది. ఈ మనస్తత్త్వాలకు ఊహాసౌధాలే ఊపిరి. కరువు కాటకాలను గురించి ఆలోచించడానికి తీరిక ఉండదు. కోరిక అసలే ఉండదు పత్రికా ముఖంగా చూసి నోరు చప్పరించడం తప్పితే!

పల్లెరా! పల్లెరా! ఇది పాడిపంటల ముల్లెరా! పల్లవిని కరువు రక్కసి తిరగ రాస్తే సరసాలకు నవరసాలకు కేంద్రాలుకదా పట్టణాలు. అందుకే కరవు రక్కసి వాతపడిన పల్లెప్రాంతాల్ని కండ్లార చూడాలన్న కోరిక మనసులో మొగ్గతొడిగింది– ఒక విలేఖరిగా.

ఆ కోరిక ఫలితమే మిడిసి పడుతున్న ఎండలో నేనా మర్రిచెట్టు కింద నిలబడడానికి కారణం. ఆ చెట్టు కింద నా అనుభవం పగవాడికైనా వద్దురా తండ్రీ! అనిపించింది. అప్పటి పరిస్థితి నాకు నాకే దయనీయంగా ఉంది. అయినా వృత్తి ధర్మం.

కనుచూపు మేరలో ఒక ఊరూ నాడు కంటపడలేదు. ఆ కాలిదోవ– పొయ్యే కొద్దికీ పోతూనే ఉంది. పోనీ, ఎవరినైనా అడిగి తెలుసుకొందామంటే పారాడే పాములే పుట్టల్లో గుట్టుగా ఉండే ఆ ఎండలో మనిషి మసలడం లేదు. ఆ ఏటికి కొంత దూరంలో ఎండి నెర్రెలు చీలిన జానా బెత్తెడు కయ్యలు... ఆ కయ్యల్లో బట్టతల మీద తేసిపోయిన జుట్టు మాదిరి మలమల మాడిపోతున్న పైర్లు.... ఏటి ఒడ్డున చాకిరేవు... ఆ రేవులో చిందరవందరగా పగిలిన కుండపెంకులు... వాడడమేలేదని వాపోతున్న పొయ్యి– బహుశా ఆప్రాంతం ఏదో ఒకఊరి పొలిమేరగా ఉండవచ్చుననిపిస్తూ ఉంది.

పొలిమేర అయితే ఒకదారి అంటూ ఉండాలి కదా! లేదే! అని దిక్కులు చూస్తున్నాను.

అంతలోనే ఒక మంద గొడ్లు ఆ చెట్టు నీడను చేరుతున్నాయి. కొన్ని కాళ్ళీడ్చుకొంటూ నడుస్తున్నాయి. కొన్ని నాలుగడుగులు వేసి నిలబడి వొగిరిస్తున్నాయి. కొన్ని లేగదూడలు మాత్రం ఒక్క లగువులో వచ్చి ఆ నీడలో తెటికల పడుతున్నాయి.

ఆ గొడ్లు కళేబరాలై కండ్లలోనే ప్రాణం నిలుపుకొన్నట్లున్నాయి. బయట పడిన బొమికలు కరువు రక్కసి కర్కశంగా గోళ్ళతో రక్కిన గుర్తుల్లా ఉన్నాయి. అడుగంటిన కడుపులు కరవు రక్కసి పాద ఘట్టనతో పడిన పల్లాలమాదిరి ఉన్నాయి.

రాళ్లు సంగీతం పలికిన సీమలో కరువు రక్కసి రాతిగుండెల్ని చెక్కుతున్నందుకు సాదృశ్యంగా దృశ్యం!

తడారిన నా గొంతు పిడచగట్టుక పోతూ ఉంది.

ఒక గొడ్డు మూత్రం పోస్తూ ఉంటే మరొక గొడ్డు అప్యాయంగా మూతిపెడుతూ ఉంది. అంతలోనే టప్‌మన్న శబ్దం చెవిన పడింది. అటు తిరిగి చూశాను. ఒక గువ్వపిల్ల విలవిల్లాడుతూ కింద పడింది. అది కింద పడేలోపుగా దాని ప్రాణాలు పైకెగిరిపోయి నట్లుంది. తల్లి గువ్వ అరుస్తూ తల్లడిల్లి పోతూఉంది. తలపైకెత్తి ఆ తల్లి గువ్వను చూశాను. తల్లి గువ్వది కాకిశోకంగా ఉంది. ఆ కొమ్మల మాటున తలదాచుకొన్న గువ్వలు మెడలు వాలేసి ఇప్పుడో ఇక కాసేపటికో అన్నట్లున్నాయి. చెంగు చెంగున ఎగురుతూ కొమ్మల మీద కోలాటాలాడుకునే ఉడతలు గోడమీద బల్లుల్లా కొమ్మలకు అతుక్కున్నాయి.

ఎద్దు మెడమీద కాడిబెట్టి రైతు మేడిపిడి చేతపట్టితే–

ఆకుల మాటున మెడలు వాలేసిన గువ్వలు– వెన్నుల మీద చిందులు!

కొమ్మలకు అతుక్కుపోయిన ఉడతలు– ఒక నర్తకురాలి కాలిమువ్వలు!!

చెట్టుకింద వొగిరిస్తూ పడి ఉన్న పశువులు తల్లిచేతి శిశువులు!!!

సకల జీవరాసులు జీవించడానికి మట్టిని బువ్వగా మార్చే రైతుమూర్తి– నేడు నడుములు విరిగి మూలపడ్డాడు.

"ఏ ఊరునాయినా మీది?"

నా ఆలోచన ఆ మాటతో తెగిపోతే తిరిగి చూశాను.

ఎప్పుడు వచ్చాడో ఏమో? ఒక పండు ముదుసలి. కొంకిదోటి నేల కానించి రెండు చేతుల మోపున ఆ దోటికట్టె మీదికి వాలబడి నన్నొక వింత మనిషిలా చూస్తూ అడుగుతున్నాడు. విల్లులా వంగిన అతన్ని చూస్తుంటే– కరువు రక్కసి అతని ఒంటి మీదనే కాపురం చేస్తున్నట్లుంది. రెప్పార్చకుండా చూస్తూ నిలబడ్డాను.

"ఏ ఊరయ్యా అంటే చెవుల్లో ఏసుకోకుండా ఏందట్లా చూస్తా ఉండావే? ఏం కనపడ్తా ఉండాదబ్బా ఈ వొక్కుకట్టెలో?"

అక్షరానికి అతడికి మధ్య ఆమడల దూరమని తెలుస్తూనే ఉంది. అయినా నా చూపుల్ని ఎంతబాగా చదవ కలిగాడు? అన్న ఆశ్చర్యంలో పడిలేవడం ఎంతసేవు?

ఊరు పేరు చెప్పాను.

"అయితే నీళ్ళూనిప్పులు దొరకని ఈ మూలకాడు కొంప కెందుకొచ్చినట్లబ్బా?"

"మిమ్మల్ని చూసి పోదామని, తాతా!"

ఆ మాట చెవిని పడుతూనే తాత అదోరకంగా చూసి ఇంకొకరకంగా నవ్వుతున్నాడు.

వెన్నెముకను అంటుకొన్న నాభినుండి వెలువడుతున్నదా నవ్వు. ఆక్రోశించే ప్రేవులు చేస్తున్న ఆక్రందనలా ఉందా నవ్వు. ఎముకల గూటిని వెనకకు ముందుకు కదిలిస్తున్నదా నవ్వు. అయితే జీవ రహితమైనదా నవ్వు!

"ఎందుకు తాతా అలా నవ్వుతున్నావ్?"

"మణిసి యేడవలేనప్పుడు నవ్వితే ఆ నవ్వు ఇట్లానే ఉంటింది నాయినా! మమ్మల్ని సూడాలని వచ్చినానంటా ఉండావే. ఏంవి సూద్దామని వచ్చినా వయ్యా? తాగేదానికి నీళ్ళా? తినే దానికి తిండా? కట్టుకునే దానికి గుడ్డా? లేదు. కంటిగింపుగా పైరు పచ్చులా? ఏం ఉండాదని? అద్దో అట్టాజూడు ఎండ. ఆ ఎండ మండినట్టు మండిపోతా ఉండాయే మా బతుకులు. ఈ బతుకుల్నేం చూస్తావ్? నీడ పాటిన నిమ్మళంగా కూసుంటే కోరింది కోరినట్లు నడిసొస్తిందే? అట్లాంటోళ్ళ బతుకుల్నయ్యా చూడాల్సింది. వాళ్ళను వదిలేసి ఈ బతుకుల్నా? చూడు. ఏమి చూస్తావో చూడు. అయ్యో నా మతి మండిపోను! ఇంతకుమునుపే ఈ చెట్టుకిందనే చూస్తివి కదా నాయినా ఒక బతుకును!"

ఆయాసం వచ్చినట్లుగా ఆగాడు తాత.

"తాతా! తాతా! అదే అడగదామనుకుంటా ఉంటే నువ్వే అన్నావు. ఎవరు తాతా వాడు?"

"వాడి బతుకెందుకులే నాయినా!"

నిట్టూర్చాడు తాత. నిట్టూరుస్తూ నిలబడ లేకపోయాడు తాత. నిలబడలేక వెళ్ళి ఆ చెట్టు కింద కూలబడ్డాడు తాత. కూలబడి చెట్టుబోదెకు వాలబడ్డాడు తాత.

ఆ పిచ్చోడి కథను విందామన్న కోరికకు కాళ్ళొస్తే వెళ్లి తాత పక్కన కూర్చున్నాను.

"ఎండనపడి వొచ్చినావు. పాపం! నోరెండక పొయ్‌నట్టుండాదే! గొంతట్ట తడుపుకో, నాయినా!" చంకలోని సొరకాయ బుర్రను తీసి అందించాడు తాత.

గుక్కెడు నీళ్ళు!

బతుకులో రకరకాల రంగునీళ్ళ రుచి మరిగిన వాడిని. అయినా ఆ గుక్కెడు నీళ్ళ రుచి! నీళ్లకు అంత రుచి ఉంటుందని అప్పటి వరకు నా అనుభవానికి రాలేదు. అదొక అనుభూతి.

అందుకే మనస్సులోనే చేతులెత్తి నమస్కరించాను, ఆ పల్లె మనస్తత్వానికి! నాగరకత ముసుగులో నలుగుతున్న వాణ్ణి కదా మరి?

ఆ చెట్టు బోదెకు అనుకొన్న తాత రెండు చేతుల్ని వెనక్కు పెట్టి, అరచేతుల్ని జత జేర్చి తలకు ఆపుగా పెట్టుకొన్నాడు. చెట్టుకు చేరగిల బడి కాసేపు అలానే శూన్యంలోనికి చూస్తున్నట్లు కూర్చున్నాడు. ఆ పిచ్చోడి ప్రసక్తి తెచ్చేసరికి తాత గుండె కండ్లల్లో కరిగి ఎర్రజీరకమ్ముకొంటే నాకు చూపడం ఇష్టం లేనట్లుగా– కాసేపు కండ్లు మూసుకున్నాడు.

ఎముకల గూడేమి వెళ్ళ గక్కుతుందో? అని ఎదురుచూస్తూ కూర్చున్నాను.

తాత ఉలిక్కి పడ్డట్టుగా ఈ లోకంలో పడ్డాడు. సర్దుకొని కూర్చున్నాడు. సొరకాయ బుర్రచేతి కందుకొని గుక్కెడు నీళ్ళతో గొంతు తడుపుకొన్నాడు. తడిసీ తడవని గొంతును తెపరాయించు కొన్నాడు– నీళ్ళు గొంతు వెంబడి జారడానికన్నట్లుగా!

నా ఆతురత కండ్లల్లో ఆశగా మోసులువేస్తుంటే తాత గ్రహించినట్లుంది.

"అదో! అట్టా చూడు నాయినా! పరుగు దూరంలో బోడిగుట్ట. కనిపించలా? ఆ బోడి గుట్ట కిందనే చింతచెట్లు. ఆ చెట్ల కిందనే ఊరు. పేరంటావా– ఉప్పరపల్లె"

తాత చూపించిన దిక్కువైపు చూశాను. మైలున్నర రెండుమైళ్ళ దూరం ఉండవచ్చు. ఒక బోడి గుట్ట. గుండ్లతో బండ్లతో నిండుకొని ఉంది. ఆ బండలు మండుతున్న ఎండలో తిరుమల కొండమీది బోడిగుండ్లు మాదిర మిలమిలా మెరుస్తున్నాయి. ఆగుట్ట కిందనే ఒక గుంపు చింతచెట్లు. ఆ ఊరిని కాపలా కాస్తున్నదెయ్యాల మాదిర దర్శనమిస్తున్నాయి. అయితే ఊరుమాత్రం కనిపించడంలేదు.

"ఆ ఊరికి నలభై గడపలుండాయి. గడప గడపకూ అంతోఇంతో కయ్యాకాలవ ఉండాది. అడకోటికి పడిగెత్తి నోళ్ళు లేరు. కూటికి లోటైనవాళ్ళూ లేరు. ఎవరి రెక్కల కష్టం వాళ్ళది. ఎవరెవరి బతుకులు వాళ్ళోళ్ళవి నాయినా!"

తాత అనుభవంతో పండాడు. పండిన ఆనుభవం మాటల్లో పండుతూ ఉంది. మారు పలక్కుండా వింటూ కూర్చున్నాను.

"మా ఊళ్ళో నల్లమ్మోళ్ళంటే, నాలుగు మడకల సేద్దిగాళ్ళు. నాలుగు రూకలు సేతిలో తిరగతా ఉండేవాళ్ళు. ఒకరి కంత పెట్టి తామంత తినగలిగినోళ్ళు. ఆ ఇంట్లో నా కండ్ల ముందర్నే పుట్నాడు నాయినా నర్సిగాడు. వాడు బుద్దెరిగిన నాటినుండి వాడిబుద్ధిని గెవనిస్తానే ఉండా. నోరు లేని గొడ్లంటే వాడట్లానే పాణం ఇడ్సిపెట్టేసే రకం!

అదేమి యిచ్చిత్రమో కానీ, నాయినా! అదెట్లాంటి సెగట గొడ్డయినా సరే– బుడంకాయంత బుల్లోడు వాడెగిరి ఈపుమింద కూసుంటే కొమ్ము అట్టాయిట్టా అనేటివిగాదు. వాడు తోకబట్టి గుంజతాఉంటే కాలట్టా జాడించేవి కావు! ఆ అలుసు చూసుకోని అవల దగ్గిర మేకల దగ్గిర వాడాడిందాట! పాడింది పాట!!

చిన్నప్పుడు వాడి చిలిపిచేష్టలన్నీ ఇన్నీ కాదులే. ఈ సెట్టుకింద కూసోని సందేళదాక సెప్పుకుంటా ఉండచ్చు. నల్లమోళ్ళ నర్సిగాడంటే గోపాల కిష్టుడనే వోళ్ళు ఊళ్లో వాళ్లంతా!

అట్టాంటోడికి ఒక జత కోడెదూడల్ని మేపాలని మునాస పుట్టింది నాయినా! వాళ్ళకేమి? లేనోళ్ళ సంగతేమో కానీ, ఉన్నోళ్ళు తల్సుకుంటే తాళలేరు. లేడికి లేచిందే పరుగన్నెట్టుగా పరమట పలమనేరు పర్సకు పొయ్‌నాడు. జోడు కోడెల్ని పట్టుకోని వచ్చినాడు. ఒకదాన్ని చూసినట్టు ఇంకొకటి. చూసేదానికి కండ్లేచాలవు నాయినా! ఒక్క అమ్మ కడుపులోనుండి ఒల్చుకోని వచ్చినట్టుండేవి!

అసలే వాడికి పసువు లంటే పాణం గదా. పరసలో ఏరికోరి కలేసిన గిత్తలు. కొమ్ములు సివ్వినాడు. కుప్పులు తొడిగినాడు. కుప్పులకు కుచ్చులు కట్టినాడు. నడువుకు నల్లెంటిక దారం కట్టినాడు. మెడకు మెడపట్టెళ్ళేసినాడు.

అప్పిటికే వాడు ఇద్దరి బిడ్డల తండ్రి, అయితే కూడా యే పొద్దన్నా పెండ్లాం సిగ సిక్కు తీసిందా? సిక్కుదీసిన సిగలో సీంవిన్ని సెండు మల్లెలు తురిమిందా? అని తల్సిన పాపాన పొయ్యుండడు.

మల్లె పూలంటే మతికొస్తా ఉండాది. కురు కురు మీసాలొచ్చే పాయాన మా యాడది కడుపుతో ఉండి మల్లెపూల మింద మోజు పడింది. నువ్వు నిజంజెప్పినా యింటావు. అపద్దం జెప్పినా యింటావు అబ్బోడా! ఆమడదూరం అరగెంటలో నడ్సినాను."

అనుభూతి విభూతి పులుముకొన్నట్టు తాత ముఖం వెలిగిపోతూ ఉంది.

కడుపార తాగడానికి దోసెడు నీళ్ళు లేవు. తినడానికి పిడికెడు కూడు లేదు. ఒంటినిండా గుడ్డలేదు. దినమూ ఆ గొడ్ల వెంబడి ఎండన పడి వరటక పోయిన ఒళ్ళు.... గుంతలు పడిన కండ్లు... కరువు కాటకాల వాతపడి నలుగుతున్న బతుకు! అయినా, వలపు తలపుతో ఆ ముసలి ప్రాణం పులకరించి పోవడం– అనుభూతికి మనిషిమీద ఎంత అధికారం ఉందనిపిస్తూ ఉంది.

ఆ క్షణంలో వీధి వాకిటికానుకొని చూపుల్ని వీధికి గుచ్చి నాకోసరం ఎదురుచూసే శ్రీమతి చుట్టూ తిరగడానికి పరుగులెత్తిన చూపులు తాత మాటతో చెట్టుకిందికి చేరుకొన్నాయి.

“అబ్బోడా! గొడ్డుబోతోడికి కూడ బిడ్డలంటే బెంవ. ఆ మాటకొస్తే నువ్వయినా నేనయినా ఇట్లా కన్నగసాట్లు పడ్తా ఉండేది కనుక్కుణ్ణె బిడ్డలకోసరమే గదా! నర్సిగాడిక్కూడా ఒక్కరి కిద్దరు బిడ్డలు. వాడి పాసుగూల! ఆ బిడ్డల ఉచ్చి మిందకంత సమురుందో? లేదో? అని చూసుకునే వాడో లేదోకానీ, పొద్దు మొలిసీ మొలవక ముందే బుడిగ సమురు ఆ గొడ్ల మింద కుమ్మరించి రుద్దతా కూసునేవోడు.

‘ఒరే నర్సిమ్మా! మా ఎద్దు మంచిది. మా ఎద్దు మంచిది! అని కొామ్మెత్తి ముక్కులో దోపుకుంటే ముక్కు చినిగి పొయ్యిందంట. అట్టుండాది గదరా నీ యవ్వారం!’ అని దోవన పోతా ఉండే వాళ్లెవురైనా అంటే– ఒక్క ఎర్రినవ్వు నవ్వతా ఎడమసెయ్యెత్తి కుడి మీసం మిందబెట్టి, కుడిచేత్తో ఎద్దు ఈపును తట్తా– ‘హుం! ఈగెవాల్తే నా సామిరంగా! జారిపోవద్దంట్రా!’ అనేవాడు.

వాడట్లా అంటాఉంటే వాడిపెగ్గెను పదిబండ్ల కెత్తాల్సిందేనాయినా!

వాడే అట్టామాదిరనుకుంటే– ఆ గొడ్లు కూడా అంతే! వాడు మేపెయ్యాల్సిందే! వాడు నీళ్ళు చూపాల్సిందే! వాడు గాట కట్టి తవుడు పెట్టాల్సిందే!

వాడు గెడియ కంటపడకపోతే అరిసి ఆగడం చేసేవి ఆ గొడ్లు!!

ఒకసారి ఏంఁవీలేదు. నర్సిమ్ముడికి జరం తగిలింది. కాళ్ళూ సేతులు కుక్కలు బీకినట్లు పీకతా ఉండాయని వాడట్లా మంచాన పడినాడు. ఇంక జూడు, నాయినా! ఆ గొడ్ల గెతి. ఒకర్ని ఫగ్గమట్టా పట్టనిచ్చినాయా? నీళ్ళమొకం చూసినాయా? గెడ్డిపోచట్టా కొరికినాయా? కొంపలు మునిగినట్టు అవ్వి కట్టు గూటాన పడి కన్నీళ్ళు కారస్తావుంటే అదొాక ఇంత మాదిర ఊరు నాడూ ఒకటై చూసింది.

ఆ గొడ్ల గోడు చూడలేకనే వాడు మూడోదినానికంతా ముక్కతా మూలగతానే లేసి తిరిగినాడు.

మనిషికి మనిషికీ మధ్య లేని ఆత్మీయతాను రాగాలు మనిషికి గొడ్డుకు మధ్య కట్టు కథలాగ తోస్తూంటే నా కండ్లల్లో అశ్చర్యం పూలు పూస్తున్నాయి.

తాత దేనికోసమో వెదుకుతున్నట్లుగా అటు ఇటు చూశాడు. కొంకి దోటి చేతి కందుకొన్నాడు. ఆ దోటి కట్టెను తిప్పించి వీపు గోక్కోవడానికి ప్రయత్నిస్తున్నాడు. దురద తీరనట్లుంది. మర్రి చెట్టువంక ఆశగా చూశాడు. అది బుడపలు తేలి ఉంది. లాభం లేదనుకొన్నాడేమో? “రాములూ!” అని ఒక్క అరుపు అరిచాడు.

ఒక్క తరుపు మెరుపులా వచ్చి తాత ముందు నిలబడింది– నన్నాశ్చర్య పరుస్తూ!

తాత వీపు చూపించాడు. ఆ వీపుమీద చెమట కారి కారి ఎండకు ఉప్పు తేలింది. ఆ వీపును అప్యాయంగా నాకుతూ ఉందా నోరులేని గొడ్డు. సహించినట్లుగా వీపును అందిస్తున్నాడు తాత.

ఆ గొడ్డుకున్న గుండెలు–

కోట్లకు కోట్లుగా నిధులు కరువు పనులకని విడుదలచేస్తుంటే ఆ నిధుల్ని మధ్యే మార్గంలో మాయంచేసే మహనీయులకుంటే?...

అలాంటి మహనీయులపైన ఈగ వాలకుండా సంరక్షిస్తున్న సహృదయులకుంటే! నీకుంటే? నాకుంటే??....

నా మనసునోరై అడుగుతూ ఉంది. ఎవడున్నాడు సమాధానం చెప్పగలిగే మొగలాయి? పెదవి విరుపులో తొంగిచూసి తొలిగిపోతున్న నిస్సహాయత!

"అట్లా పాణానికి పాణంగా సాకతావుంటే ఈ మాయదారి కరువు వచ్చిపడింది. ఇంక జూడబ్బోడా వాడగసాట్లు! కుక్కల కెరిక!"

తాత వైపు చూశాను. వీపు దురద తీరినట్లుంది. రాముడు వెళ్ళిపోతున్నాడు. పై తుండు గుడ్డను మెలిబెట్టి రెండు చేతులతో రెండుచివరల్ని పట్టుకొని వీపుమీద తడిని రుద్దుకొంటూ చెబుతున్నాడు!

"తెల్లారే యాళకు నాలుగ్గట్టల వరి కసువు... మద్దేనాల కాడ నోటికి ఉప్పంగా అయిదారు కట్టల రాగిచొప్ప... నాలుగుబార్ల పొద్దుకాడ కాలాడలని ఎలదోల్తే గెనిమల మింద గెరిక్కసువు... పొద్దుగుంకేటప్పుడు బుట్టెడు తవుడూ, గానిగపిండి... జావురేత్తిరికాడ రొండుమోపుల పచ్చిగెడ్డి– యిట్లా తింటావుండిన గొడ్లకు ఈ కరువుకాలంలో ఎట్లా తెచ్చేసేదంతమేపు?

అయినా వాడి తిప్పలు వాడు పణ్ణాడు. కొన్నంత కొన్నాడు. 'ఈ కరువు కాలంలో మణుసులకు తిండి దొరికేదే వొక గండంగా ఉంటే– నువ్వు కొంపనిట్లా సదరం జేసిగొడ్లకు బెడ్తే యింక బతికేదెట్ట?' అని కొంపలో రంపు రగలబడేటప్పటికి నాయినా! వాడు అడువులమింద పణ్ణాడు.

మామండూరు అడవి ఉండేదేడ? దగ్గిర దావాదమా? తొలి కోడి కూసేయాళకాడ దోసిడు కూట్నీళ్ళు నోట్లో పోసుకోని ఎలబారిపోతే పొద్దుతిరిగేయాళకు మోపు కసువు దెచ్చేవోడు. ఆ ఒక్క మోపు కసువు ఆగొడ్ల కేడికిసాల్తింది నాయినా! చాలనప్పుడు అట్టా యిట్టా జూసి దొంగిలించేదానిగ్గూడ ఎనకాడ లేదు వోడు.

అద్దో! ఈ పొద్దు కురిస్తింది వాన. రేపు కురిస్తింది వాన! అని ఆకాశంకల్లా ఎగజూసెగ జూసి యాసారి పొయ్‌నాము. ఇంక వానలు కురవ బొయ్యేది లేదు. మణిసీమట్రా బతకబొయ్యేది లేదు. గొడ్ల కింత మేపు దొరకబొయ్యేది లేదు. గొడ్డు గోదా కట్టుగూటాన పడి చావాల్సిందే!

అనుకునేకుందికి కోడె దూడల్ని అమ్మేయాలను కుణ్ణాడు నర్సిగాడు. ఎట్లా తన గాట్లో కసువు లేదు. కసువుండే గాటికైనా పోనీలే! అని సరిపెట్టుకుణ్ణాడు.

వాడట్లా అనుకుంటూ ఉండంగానే ఊర్లో ఒక ఆ సామి దిగబడడమూ కల్సి మాట్లాడుకుణ్ణట్టు జరిగిపాయ.

"కోడెదూడ లిస్తావా?" అడిగినా డాసామి.

ఆ ఆసామిని ఎగాదిగా చూసి నాడు నర్సిగాడు.

ఆ ఆసామి ఎనిమిది మూరల మల్లుపంచె 'సైకిలు కట్టు' కట్టినాడు. పంచెకట్టు మింద తెల్లటి అరచొక్కా తొడిగినాడు. సుంగిడిసి తలగుడ్డ సుట్టినాడు. ఏ లేలికీఉంగరాలూ... ఎడమ సేతికి గెడియారం... కుడిసేతిలో బెత్తం... బాగా ఎసులుబాటుండే రైతో లేకుంటే మారు బేరాల దళారో అనిపిస్తా ఉండాడు.

"ఇస్తాను సూడు" అన్నాడు నర్సిగాడు.

ఆసామి సూసినాడు అబ్బోడా! కొమ్ము తీరు సూసినాడు. పలు వరస పట్టి సూసినాడు. కాటిక్కండ్లేవో అని కండ్లు సించుకోని చూసినాడు. సుడీ గిడీ ఉండాదేమో గెవనించినాడు. ఒక గాట్నుంచి ఇంగొక గాటికి మార్సే మంచోడి మాదిర్తో మీసం మెలేస్తా, ఎంత? అనిఅడిగినాడు.

బొట్నేలిని మడిసి అరిచేతిని చూపించినాడు– నర్సిమ్ములు నాలుగేలు అన్నెట్టుగా.

"తీసుకో!" అన్నా డాసామి.

అబ్బోడా! ఆడబిడ్డను సాకి సంతరిస్తాము. సల్లంగా బతకాలని ఎవుడో ఒకడి సేతిలో పెడ్తాం. తీరా ఆ బిడ్డె ఇల్లొదిలి పొయ్యేటప్పుడు ఇల్లెగిరి పొయ్యేటట్టు ఏడస్తాం. నర్సిమ్ముడి గెతిగూడా అట్లనే అయ్యింది. మాట జారేదానికేమో జారేసినాడు. దుడ్లు తీసుకోమనేకుందికి వాడి సంగటం దేవుడి కెరిక!

దుడ్లు చూస్తాడు. గొడ్లను చూస్తాడు. ఆసామిని సూస్తాడు. ఎట్లా సెప్పలేక సెందలేక అట్లా యిట్లా సూస్తాడు. సేతులు నలుపుకుంటాడు. జుట్టు పీక్కుంటాడు. ఎట్లా తోసక ఎర్రిగా సూస్తా నిలబడుకుణ్ణాడు.

"ఇద్దో దుడ్లు తీసుకోని ఎంచుకో!" ఆసామి తొందరపెడ్తా ఉండాడు.

ఆసామి సెయ్యి చాపతాఉంటే నర్సిమ్ముడి సెయ్యి ముడచకపోతా ఉండాది. అందుకే పెండ్లాన్ని రమ్మని గావుకేకపెట్నాడు. ఎందుకో? ఏమో? అనుకోని ఆ ఇల్లాలు ఉన్న పళంగా వచ్చి నిలబడ్తే 'దాని చేతి కిచ్చేయ్!' అని అంటా మొకం సూపించలేకుండా మొకాన గుడ్డేసు కోని పారిపొయ్‌నాడు.

యాడేడ తిరిగినాడో ఎట్టెట్టా ఏడ్సినాడో? తిండి తిప్పలు లేకుండా తిరిగి తిరిగి ఆ మరసటి నాడు పొద్దుగూట్లో పడే యాళకాడ ఇంట్లో అడుగు బెట్టి అట్లానే రెప్పార్చకుండా నిలబడి పొయ్‌నాడు.

గాటినిండా కసువు. అవురావురని తింటా కోడె దూడలు!

వాడి కడుపు నిండిపొయ్యింది.

"ఆసామికి ఇంకా పదిగాండ్ల గొడ్లు కావాలంట! నువ్వట్లా పోతానే దుడ్లు నాచేతి కిచ్చేసినాడు. సందేళకు బండి కసువు తోలించినాడు. పదిగాండ్లు కొనాలని పాయకట్టు మింద పణ్ణాడు. ఆయరవదాకా మన దూడల్ని మన గాట్నే కట్టేసుకోమన్నాడు." పెండ్లాం మాటల్తో నర్సిమ్ముడి మణుసు కుదటపడింది.

వారం తిరక్కముందే ఆసామి పాయకట్టంతా కాలికి బలపం కట్టుకోని తిరిగి తిరిగి బాగా కండమిందుండే పదిగాండ్లను పట్టకచ్చినాడు. నర్సిగాడింటిముందర్నే గూటాల్దించి కట్టేసినాడు.

నర్సిమ్ముణ్ణి పట్టేదానికి పగ్గాల్లేవు నాయినా! అసలే వోడికి పసువు లంటే పాణం గదా? అవన్నీ తన గొడ్లే అనుకుణ్ణాడు. ఆ గొడ్లకంతా మేపేసేదీ వాడే! నీళ్ళు జూపేదీ వాడే! పేడకళ్ళెత్తేసేదీ వాడే! ఆ ఊపులో వాడు గొడ్లను అమ్మేసిన సంగతే మర్సిపోయ్‌నాడు.

వాడి పిచ్చిలో పడి వాడు కొట్టకపోతా ఉంటే ఒకనాడు బల్లుమని తెల్లారేళకు ఒకలారీ వొచ్చి యింటి ముందర నిలబడింది. ఆ లారీని సూసేకుందికి యాడలేని అక్కర గలిగింది ఆసామి మింద నర్సిమ్ములికి. ఎందుకంటావా అబ్బోడా! వాడు కోడెదూడల్ని పట్టింది పలమనేరు పర్సలో గదా? పలమనేరంటే పదామడల దూరం. ఆడనుండి మూడు పొగుళ్ళు మూడు రాత్రిళ్ళు దూడల్ని నడిపించుకొనే వొచ్చినాడు. ఇప్పుడాసామి అడుగు కింద బెట్టకుండా గొడ్లకేమాత్రం దెప్పరం తగలకుండా లారీమిం దెక్కించి తోలకపోతా ఉండాడంటే మణిసి ఎంత మంచోడు? అని అనుకుణ్ణాడు. చెయ్యెత్తి దణ్ణం పెట్టు కుణ్ణాడు. దగ్గిరుండి కోడెదూడల్ని లారీ కెక్కించినాడు.

డ్రైవో రెక్కి కూసుణ్ణాడు.

"అయ్యా! అయ్యా!! ఒక్క నిమిశం నిలబడండయ్యా! నా గడప దాటిపోతా ఉండే గొడ్లు. ఏ గడపలో కాలు బెట్తాయో? ఏమో? ఆ గడపలో పాలుపొంగాల! టెంకాయ సుట్టి కొట్టాల. ఎర్ర నీళ్ళు దిగదీసి పొయ్యాల. వస్తానుండండయ్యా!!"అంటా ఇంట్లోకి పరిగెత్తినాడు నర్సిమ్ములు.

గంగాళం తట్టెత్తుకుణ్ణాడు. దాంట్లో అన్ని నీళ్ళుపోసుకుణ్ణాడు. చిటికెడు పసుప్పొడి రవ్వంత సున్నం ఏసి కలగలపతా ఉండాడు.

"అంబా!" అని గుండెలు అవిసి పొయ్యేటట్లు అర్సినాయి కోడెదూడలు. ఆ అరుపుతో ఇంటి కప్పెరిగి పోతిందేమో అనిపించింది. వాడు అర్సి నాడబ్బోడా! చావుఅరుపుఅర్సినాడు. సేతిలో తట్ట సేతిలో ఉండంగానే ఒక్క లగువులో వచ్చి వాకిట్లో పణ్ణాడు.

లారీ ఎలబారి పోతా ఉండాది!

లారీలో వాడి కోడెదూడలు. కుప్పగా కూలబడుండాయి. వాణ్ణి సూస్తానే లేవ జూస్తాయి. లెయ్యలేక "అంబా! అంబా!" అని గొంతు చించుకుంటాయి. మల్లా మోర ముందుకు సాస్తా లేసే దానికి ముంపతాయి. లెయ్యలేక కుప్పగా కూలబడ్తాయి. గుండెలవిసేటట్లు 'అంబా' అని

అరస్తాయి. మల్లా లేసే దానికి ముంపతాయి. ఎట్లా లేస్తాయి నాయినా? మోకాలి చిప్పలు ఇరగ్గొట్టుంటే?

లారీలో ఎక్కిన ఆసామి మణుసులు కొందురా గొడ్లకు మోకాలిచిప్పలు ఇరగ్గొడ్తా ఉంటే, కొందురు కండ్లు పొడిసేస్తా ఉండారు. ఆ లారీలో ఆ గొడ్ల చావు అరుపులు ఏమని సెప్పమంటావు నాయినా? లారీ చుట్టూ చేరినోళ్ళు– అయ్యో! అయ్యో!' అంటా ఉంటే 'అయ్యో లేదు. గియ్యో లేదు. రేప్పొద్దన గొంతులు కోసే గొడ్లకు ఇప్పుడు మోకాల్చిప్పలు తీసేస్తే మునిగిపొయ్యిందేముంది? పదండ్రా?" అన్నాడా సామి.

లారీ ఆగమేగాల మింద పోతా ఉండాది.

ఆ లారీలో నుండి రగతం నాయినా! పై మొబ్బు సినుకల్లా పడ్తా ఉండాది.

నర్సిమ్ముడి చేతిలో గంగాళం తట్ట జారిపడి పొయ్యింది. వాడు కుప్పగా కూలబడినాడు. 'బొరో!'మని ఏడస్తా నెత్తుర్లో తడిసిన మట్టిని దోసిడు జవురుకున్నాడు. 'ఒరే! నీ యాలితాడు తెగ. నీ నోట్లో ఈ మట్టి పడా! నీ దుడ్లు నీకిచ్చేన్తా. నా గొడ్లు నా కిచ్చేయ్!' అంటా ఆ లారీ ఎంటపణ్ణాడు. ఎంత దూరమని పరిగెత్తతాడు. నాయినా! యాడనో ఒకసోట బోర్ల బొక్కల పడనే పణ్ణాడు. తల దిమ్మదిరిగే టట్టు దెబ్బ తగలనే తగిలింది. ఆ పొద్దుట్నుంచీ ఇంతే! నీ దుడ్లు నీ కిచ్చేస్తా! నా గొడ్లు నా కిచ్చేయ్!' అని కనిపించిన వాణ్ణంతా అడగతా ఉంటాడు. ఎవరిస్తారు? ఎట్లా ఇస్తారు??"

తాత గొంతు పూడుకపోయింది.

నా మనస్సులో మనసు లేదు. నన్నా చెట్టు కింద వదలి అదెప్పుడో ఆ 'పిచ్చోడి' వెంటపడింది. ఎంత ద్వేషించినానో అంత అభిమానిస్తున్నాను వాడిని.

"ఏందో నాయినా! ఆ గొడ్లను మడక కడతాము. మోట కడతాము. పొలాల్లో పంట పండిస్తాము. ఆ పంటను కోసుకుంటాంవు. కొదవకా గొడ్లనూ కోసుకోని తింటాం. పిడికిడు కసువు కడవ కుడితి నీళ్ళు వాటి మొకాన గొట్టి బతికినప్పుడేమో అట్లా సతాయిస్తాం. సచ్చినాక ఇదో ఇట్లా కాళ్ళ కిందేసి తొక్కతాము?"

తాత లేచి నిలబడి కాళ్ళకు చెప్పులు తొడుక్కోవడానికి యత్నిస్తున్నాడు.

నేను తాత గుండెని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నాను.

కానీ... కానీ... తాత చెప్పులకింద నలుగుతూ నాగుండె కన్నీళ్లుగా కరిగి! ●

ఆంధ్రప్రభ
(14, జూలై 1982)